క్లుప్తంగా

పేదల భూములపై ఆంక్షలు తొలగించాలి



తిరువూరు: నియోజకవర్గంలో పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయ, విక్రయాలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. విజయవాడలోని జేసీ కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే బుధవారం కలిసి రైతుల ఇబ్బందులను వివరించారు. గంపలగూడెం మండలం వినగడప, విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే కోరారు.

భవన నిర్మాణం పూర్తిచేయండి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): గ్రామంలో చేపట్టిన సచివాలయ నిర్మాణం పనులను త్వరతిగతిన పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎంపీడీఓ బి.భార్గవి సూచించారు. ఎంపీడీఓ, ఏఈ శివరామకృష్ణ కొత్తూరు తాడేపల్లిలో నిర్మాణ దశలో నిలిచిపోయిన సచివాలయ భవనాన్ని బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణ కాంట్రాక్టు తీసుకున్న ఎల్.పుండరీక వర్మతో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. వేమవరం కాలనీలో రోడ్లు అభివృద్ధి చేయాలని స్థానికులు ఎంపీడీఓను కోరారు. మెయిన్‌రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఎంపీడీఓ తెలిపారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, కార్యదర్శి మురళీ మోహనరావు పాల్గొన్నారు.

ప్రత్యేక వ్యాక్సిన్ శిబిరం

తిరువూరు: స్థానిక 10వ సచివాలయంలో బుధవారం తల్లులు, చిన్నారులకు ప్రత్యేక వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు, తల్లులకు టీడీ వ్యాక్సిన్ వేస్తు వేశారు. ఈ కార్యక్రమాన్ని 19, 20 వార్డు కౌన్సిలర్లు పరసా సత్యనారాయణ, షేక్ నదియా ప్రారంభించారు. ఆరోగ్య, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజీపీగా మాళావతు రాము

తిరువూరు: స్థానిక కోర్టుల్లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా మాళావతు రాము నియమితులయ్యారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో రాము బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కస్తూర్బా బాలికల స్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలను కాపాడండి, లింగవివక్ష లేకుండా చూడండి, గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షలు జరపొద్దు అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామల, రెడ్డిగూడెం పీహెచ్‌సీ సిబ్బంది శ్యాం సుందరరావు, రామ్‌కుమార్, భవానీ, శితరో తేజస్విని, ఆశా కార్యకర్తలు విద్యార్థినులు పాల్గొన్నారు.

వృద్ధులకు నెలకు రెండుసార్లు వైద్య పరీక్షలు



నూజివీడు: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నెలకు రెండు సార్లు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మండలంలోని తుక్కులూరులో ఉన్న జేబీఎల్ వృద్ధాశ్రమాన్ని సబ్‌కలెక్టర్ బుధవారం సందర్శించారు. వృద్ధులకు ఉన్న వసతులను, అందుతున్న ఆహారం తదితర విషయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ కొందరికి రేషన్‌కార్డుల సమస్యలున్నాయని, మరి కొందరికి పింఛన్ రావడం లేదని, వాటన్నింటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్‌తో పాటు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బండారు సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



వెల్వడంలో ఆరోగ్య కార్డు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు



అనుముల్లంకలో మందులు పంపిణీ చేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వైద్య శిబిరాలకు ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, సర్పంచ్ ముచ్చు సీతయ్య, తహసిల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వైద్యాధికారి స్వాతి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని చెన్నారావు, దాసరి సతీష్, గోపాలరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ స్థాపనకు ప్రభుత్వం కృషి

అనుముల్లంక(గంపలగూడెం): ఆరోగ్య సమాజ స్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణ నిధి తెలిపారు. గంపలగూడెం మండలం అనుముల్లంక పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి, కావల్సిన పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారని వివరించారు. అనంతరం గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులు దీప్తి, సురేష్, పిల్లల వైద్య నిపుణులు వాసవి 969 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీచేశారు. మాతాశిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ప్రదర్శించి పౌష్టికాహారం ఆవశ్యతకను వివరించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, సర్పంచ్ అత్తునూరి దీప్తి, ఎంపీటీసీ సభ్యుడు గౌరసాని కమల, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎంఈఓ నరసింహారావు, ఉపసర్పంచ్ మంజూషా, వైఎస్సార్ సీపీ నాయకులు చావా వెంకటేశ్వరరావు, అత్తునూరు పద్మారెడ్డి, గౌరసాని శ్రీనివాసరెడ్డి, గౌరసాని రంగారెడ్డి, సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్వడం సచివాలయం–2 పరిధిలో..

వెల్వడం(మైలవరం): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి జగన్ కృషి ఫలించిందని వెల్వడం సొసైటీ ప్రెసిడెంట్ తోట తిరుపతిరావు తెలిపారు. వెల్వడం గ్రామం సచివాలయం–2లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.తిరుపతిరావు, సర్పంచ్ పి.ధర్మరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, గ్రామ అధ్యక్షుడు వై.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలు హర్షణీయం

జి.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడం హర్షణీయమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, సర్పంచ్ మండల అరుణ, పీఏసీఎస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, నెల్లూరి లీలా శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, వేములకొండ సాంబశివరావు, వేములకొండ విష్ణు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

విస్సన్నపేట: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సచివాలయం –2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక వినూత్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు దస్తగిరి, నాయకులు లకుం పవన్, పిల్లి రాజేష్, సాధుపాటి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సి.కె.నాయక్ పరిశీలించారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

చాట్రాయి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య రక్షణగా నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూష పేర్కొన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. డాక్టర్లు వెంకటేశ్వరరెడ్డి (ఆర్థోపెడిక్), అరవింద్, విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాదు, జ్యోతి, కంటి వైద్యురాలు వరుణ తదితరులు 413 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రావిచర్లలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కొత్త రావిచర్లలో..

నూజివీడు: మండలంలోని కొత్తరావిచర్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దిగవల్లి, గొల్లపలి పీహెచ్‌సీల వైద్యాధికారులు బి.సునందాకుమారి, శ్రీనివాస్ 336 మంది గ్రామస్తులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సర్పంచి కాపా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లావు నాగవరప్రసాద్, తహసీల్దార్ డి.వి.ఎస్.యల్లారావు, ఎంపీడీఓ వి.ఎ.విజయ్ కుమార్, ఎంపీటీసీ మరీదు శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం.. పేదలకు వరం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు మంచి ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ కంచర్ల వాణి అన్నారు. ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన బుధవారం గోపవరం హైస్కూల్ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వైద్య శిబిరం జరిగింది. వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్, ప్రతాప్, ప్రత్యేక వైద్య నిపుణుడు సురేష్, ప్రసూతి వైద్య నిపుణురాలు స్వప్న సింధు 470 మందికి వైద్య సేవలు అందించారు. 107 మందికి నేత్ర పరీక్షలు చేసి, ఐదుగురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్, ఖాలీషా మస్తాన్ వలి, వెంకమ్మ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన కల్పించాలి



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

తిరువూరు: ఎస్సీ, ఎస్టీలకు చట్టపరంగా ఉన్న హక్కులను గ్రామస్థాయిలో వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి సూచించారు. తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం ఆర్డీఓ అధ్యక్షతన బుధవారం జరిగింది. తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎంపీడీఓలు ప్రతినెలా చివరి రోజున సివిల్ రైట్స్ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆర్డీఓ సూచించారు. తిరువూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో వార్డెన్ పర్యవేక్షణ లేక విద్యార్థినులకు ఇబ్బంది కలుగుతోందని, ఏఎస్‌డబ్ల్యూఓ వెంటనే విచారణ జరపాలని ఆర్డీఓను సభ్యులు కోరారు. ఎ.కొండూరు మండలంలో ఆత్మహత్య ఘటనలు ఎక్కువగా జరుగుతున్నందున గిరిజనులకు ఉన్న చట్టపరమైన హక్కులను వివరించి వారిలో మనోధైర్యం నింపడానికి అధికారులు కృషిచేయాలని సభ్యులు కోరారు. ఎ.కొండూరు మండలంలో రైతులకు బకాయి పడిన సొమ్ము ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. తిరువూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, పద్మారావు, మాజీ ఎంపీపీ కోట దాసు, తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వమంతా లెక్కల మయం



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం: మానవుడు కనుగొన్న అద్భుత ఆవిష్కరణల్లో అంకెలు ముఖ్య పాత్ర పోషిస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాథ్స్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో గ్రూప్ థియరీ అంశంపై ఒక రోజు జాతీయ సెమినార్ బుధవారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ.. విశ్వమంతా లెక్కల మయమన్నారు. లెక్క ఉంటేనే జీవితానికి అర్థం, పరమార్థం అని పేర్కొన్నారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ డోలా దేవానందరావు, గద్వాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రూప్ థియరీ ప్రత్యేకతలను పీపీటీల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమాన్ని మాథ్స్ విభాగం శాఖాధిపతి కాట్రగడ్డ హరిబాబు పర్యవేక్షించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

చింతలనర్వ(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండలం చింతలనర్వ గ్రామంలో గురువారం వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి బుధవారం తెలిపారు. గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యులు, స్పెషలిస్టు డాక్టర్లు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండల పరిషత్ పాఠశాల వద్ద వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

కొర్లమండలో..

విస్సన్నపేట: మండలంలోని కొర్లమండ గ్రామ సచివాలయం పరిధిలో స్థానిక ఎంపీయూపీ పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం గురువారం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు.

నేడు జగనన్న కాలనీ ప్రారంభోత్సవం

మైలవరం: మండలంలోని చంద్రాలలో నిర్మించిన జగనన్న కాలనీని గురువారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.వెంకట్రావు బుధవారం తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్‌లు, నాయకులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే అప్పారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ దంపతులు



ఆగిరిపల్లి శోభనాచలస్వామి ఆలయంలో స్వామి సేవలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకుల నడుమ బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం ఉన్న ద్వారకా ఎస్టేట్‌కు బుధవారం ఉదయం నుంచే నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల నుంచే కాకుండా రెడ్డిగూడెం, బాపులపాడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రతాప్ అప్పారావు కేక్‌ను కట్‌చేశారు. పలువురు నాయకులు ప్రతాప్‌కు కేక్ తినిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, ఏపీ స్టేట్ కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, సీనియర్ నాయకులు, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, మిద్దే బాలకృష్ణ, పలగాని నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు తులిమెల్లి, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, టౌన్ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, రూరల్ సీఐ పి.బాలసురేష్‌బాబు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, పెరిక, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌లు అత్తి పార్వతి, గొర్రెల మాధవి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి, విద్యా మౌళిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలస్వామి సేవలో ఎమ్మెల్యే

ఆగిరిపల్లి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తన జన్మదినం సందర్భంగా ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ వేదపండితులు శేషుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ప్రతాప్‌కు తీర్థప్రసాదాలను అందించారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, నాయకులు గోళ్ల ఇస్సాకు, ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, పల్లె రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాణిమేకల సత్యన్నారాయణ, సాదం గోపి, సర్పంచ్‌లు కేఎస్ఎస్ దిలీప్, సురేష్‌బాబు, అత్తి మురళీ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణానికి అంచనాలు

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని కొండపల్లి మునిసిపాలిటీ ఐదో డివిజన్‌లో సైడు డ్రెయిన్ల కల్వర్టుల నిర్మాణానికి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బుధవారం అంచనాలు రూపొందించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో 15వ ఆర్థిక సంఘం నిధులను ఐదో వార్డుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో కలసి ఏ ప్రాంతంలో కల్వర్టులు అవసరమవుతాయో పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని కౌన్సిలర్ దయాసాగర్ తెలిపారు.

గురుకులాన్ని సందర్శించిన అధికారులు

తిరువూరు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను జిల్లా సమన్వయాధికారి బి.సుమిత్రాదేవి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం సందర్శించింది. రాష్ట్రంలోని గురుకులాల్లో బోధన, వసతి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి పావనమూర్తి ఆదేశాల మేరకు అధికారులు విచ్చేశారని ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు బోధన, అభ్యసన స్థాయిలు, అధ్యాపకుల రికార్డుల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు.